సీఎం రేవంత్ రెడ్డిని సన్మానిస్తున్న ఎత్తిరి అంతయ్య

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని వడ్డెర భవన సముదాయ ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎత్తిరి అంతయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిసి విన్నవించారు. వడ్డెరుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు అంజయ్య, నాగరాజు, రాజు, అనంతరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలపై చర్యలు

గోల్నాక, ఫిబ్రవరి 2: గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్న స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ దూసరి లావణ్య సూచనలతో శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ ఆయా ప్రాంతాల్లో సమస్యలను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో కలిసి సిబ్బందిచే మ్యాన్‌హోళ్లు శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

● అంబర్‌పేట ఎమ్మెల్యే వెంకటేశ్

బస్తీ దవాఖానను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్, తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 2: బస్తీ దవాఖానలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. గోల్నాక డివిజన్‌లోని కామ్‌గార్‌నగర్ ఉన్న బస్తీ దవాఖానను ఎమ్మెల్యే కాలేరు శుక్రవారం సందర్శించి, రిజిస్టర్ తనిఖీ చేసి, రోగులను సమస్యలు అగిడి తెలుసుకున్నారు. అనంతరం, ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని బస్తీ దవాఖానలను ఏర్పాటు చేశారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, బస్తీ దవాఖాన మెడికల్ అఫీసర్ డాక్టర్ నజీము న్నీసా, బస్తీవాసులు పాల్గొన్నారు.

మద్యం సేవించిన వాహనదారులకు జైలు, జరిమానా

కాచిగూడ, ఫిబ్రవరి 2: మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులకు కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇటీవల కాచిగూడ, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన తనిఖీలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 15 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 15 మందికి శుక్రవారం నాంపల్లి 7 ఎంఎం కోర్టులో హాజరుపర్చగా 12 మందికి రూ. 2100ల జరిమానా, ఇద్దరికి 2 రోజులు జైలు శిక్ష, ఒక్కరికి 4 రోజులు జైలు శిక్షలను న్యాయమూర్తి విధించారు.

దాక్షాయినికి పురస్కారం అందజేస్తున్న అంజయ్య నేతాజీ

హైదరాబాద్ స్టేట్ పార్టీ ఆవిర్భావం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: హైదరాబాద్ స్టేట్ పార్టీ ఆవిర్భావ సభ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు గుండు అంజయ్య నేతాజీ మాట్లాడుతూ, భాతర రెండో రాజధానికి సాధించడం కోసం హైదరాబాద్ స్టేట్ పార్టీని స్థాపించడం జరిగిందన్నారు. నగరంలో తెలుగు ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజలు ఇక్కడ స్థిరపడ్డారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌ను భారత రెండో రాజధానిగా సాధించే దిశగా ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. అనంతరం, హైదరాబాద్ సాధన సమితి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ విద్యావేత్త, సీతా రామయ్య విద్యా సంస్థల అధినేత ద్రాక్షాయిని జీవిత సాఫల్య పురస్కారంతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులకు పురస్కారాలను అందజేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో దళిత సేన నాయకులు రాజు, రచయిత బిక్కి కృష్ణ, లింగమూర్తి, భూక్యా శంకర్ నాయక్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య యోధుడికి భారత రత్న.. హర్షణీయం

కవాడిగూడ, ఫిబ్రవరి 2: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించిన సందర్భంగా కవాడిగూడ గాంధీనగర్‌లో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రధాని మోడీ చిత్ర పటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కవాడిగూడ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కె.రాములు, ఉపాధ్యక్షుడు సత్య నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.సత్యం, కోశాధికారి ఏ.శ్రీనివాస్, తెలుకంటి అయిలయ్య, ఓబీసీ మోర్చా నాయి బ్రాహ్మణ సంఘం మహంకాళీ జిల్లా కన్వీనర్ సంతోష్, టి.రవీందర్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, నరేష్ ముదిరాజ్, జమాల్ పూరి నందు పాల్గొన్నారు.

నర్సింగ్ అధికారుల నియామకం హర్షణీయం

● తెలంగాణ రిజిస్టర్డ్ నర్సెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుజాత రాథోడ్

నర్సుల అసోసియేషన్ బృందంతో సుజాత రాథోడ్

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 2: పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందించేలా నర్సింగ్ అధికారుల నియామకాలను జరిపిన తెలంగాణ ప్రభుత్వానికి తెలంగాణ రిజిస్టర్డ్ నర్సెస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షురాలు సుజాత రాథోడ్, డాక్టర్ బొంగు రమేష్, వెంకటేశ్వర్ రెడ్డి, విజయనిర్మల, వేణుగోపాల్ గౌడ్, శిరీషలు మాట్లాడుతూ 6,956 నర్సింగ్ ఆఫీసర్ల నియామకం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ స్ఫూర్తితోనే నూతనంగా నియమితులైన నర్సులు నూతన టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తామని పేర్కొన్నారు. ఈ నియామకాలు చేపట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రామలక్ష్మి, మూర్తితో పాటు నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడలో రాణించాలని..

భవిష్యత్తులో బాక్సింగ్ క్రీడల్లో మరిన్ని పతకాలను సాధించి దేశానికి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని జిల్లా శాఖ కార్యాలయంలో నిజామాబాద్‌కు చెందిన బాక్సర్‌గా మంచి పేరు ప్రఖ్యాతలు పొందిన మహమ్మద్ హుసాముద్దీన్‌కు డెప్టినీ గ్రూప్స్ ప్రకటించిన రూ.రెండు లక్షల చెక్‌ను ఆయన చేతుల మీదుగా మహమ్మద్ ఎత్తేషాముద్దీన్, రతన్ కుమార్‌లకు అందజేశారు. – సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 2

నందరాజ్ గౌడ్‌కు ఘన నివాళి

బాగ్ అంబర్‌పేట సీతా కాలనీలోని స్థూపం వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన తిలక్‌నగర్ మాజీ కార్పొరేటర్ నందరాజ్ గౌడ్ 31వ వర్ధంతికి శుక్రవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. నందరాజ్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
– అంబర్‌పేట, ఫిబ్రవరి 2

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

అంబర్‌పేట డివిజన్ ఆజాద్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.
– గోల్నాక, ఫిబ్రవరి 2

సీసీ కెమెరాలతో శాంతి భద్రతల పరిరక్షణ

ప్రజల శాంతి, భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మజీద్ హుస్సేన్ అన్నారు. నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం పద్మనాభనగర్ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన 36 సీసీ కెమెరాలను ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్ గుడి మల్కాపూర్ ఇన్స్పెక్టర్ రాజుతో కలిసి ప్రారంభించారు. – మెహిదీపట్నం, ఫిబ్రవరి 2

నానల్‌నగర్‌లో వీడీసీసీ రోడ్ల నిర్మాణం

కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులు చురుకుగా కొనసాగిస్తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ ఆదేశాలతో నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ శుక్రవారం పర్యవేక్షించారు. అంతర్గత రోడ్లను అన్నీ బస్తీలు, కాలనీల్లో నిర్మిస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. – అబిడ్స్, ఫిబ్రవరి 2

కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఉమ, డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముందస్తు చికిత్సతో కుష్ఠును నయం చేయొచ్చు

కాచిగూడ, ఫిబ్రవరి 2: ప్రభుత్వాలు కుష్ఠు వ్యాధి నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ అన్నారు. ఆర్ఎఫ్‌పీటీసీ (కోఠి) ఆధ్వర్యంలో ఈ నెల 13 వరకు కుష్ఠు వ్యాధిపై పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారని ఆయన పేర్కొన్నారు. కార్పొరేటర్ ఉమా మాట్లాడుతూ కుష్ఠు రోగం ప్రాణాంతకమైనది కాదని, ముందస్తు చికిత్సతో నయం చేయొచ్చునని, ఎండీటీ (మల్టీ డ్రగ్ థెరఫి) చికిత్సతో కుష్ఠు వ్యాధిని నివారించినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్ యాదవ్, డాక్టర్లు ఎం.మనోజ్‌రెడ్డి, జానబాయి, పద్మావతి, లలిత, శ్రీనివాస్‌రెడ్డి, వనితతో పాటు ఆశా వర్కర్లు, నర్సులు పాల్గొన్నారు.

బస్తీల అభివృద్ధిపై దృష్టి

బస్తీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని వీవీ గిరి నగర్‌బస్తీలో శుక్రవారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ డీఈఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహేశ్, వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీల నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారుకుల ఆదేశించారు. నాయకులు ఏ. వినయ్‌కుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి, ఫిబ్రవరి 2

మల్లేపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధిని అందిస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మజీద్ హుస్సేన్ అన్నారు. మల్లేపల్లి డివిజన్ హబీబ్‌నగర్, ఆగాపురా ప్రాంతాల్లో ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్‌తో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీల్లో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే సమస్యల గురించి ఆరా తీశారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల ప్రకారం అన్నీ సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ పేర్కొన్నారు.
– అబిడ్స్, ఫిబ్రవరి 2

ఉత్తమ సేవలు అందించాలి: ఏసీపీ

ప్రజలకు ఉత్తమ సేవలందించడానికి కృషి చేయాలని కుల్సుంపురా ఏసీపీ ఎంఏ జావీద్ అన్నారు. గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్‌గా నియమితులైన బైరి రాజు కుల్సుంపురా ఏసీపీ ఎంఏ జావీద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ జావెద్ మాట్లాడుతూ ప్రజల శాంతి, భద్రతలకు విఘాతం కల్గకుండా నిరంతరం పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించాలన్నారు.
– మెహిదీపట్నం, ఫిబ్రవరి 2

వర్సిటీ సమస్యల పరిష్కారానికి కృషి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: తెలంగాణలోని యూనివర్సిటీలలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. నిధుల సమస్యతో వర్సిటీలు కొట్టుమిట్టాడుతున్నాయని చెప్పారు. ఫ్యాకల్టీ లేకుండా విద్యావ్యవస్థ పనిచేయదన్నారు. టీఏయూటీఏ ఆధ్వర్యంలో 'ఉన్నత విద్య–యూనివర్సిటీల సమస్యలు, పరిష్కారాలు'పై శుక్రవారం సదస్సు నిర్వహించారు.

కళా సేవకులు గౌతమ్‌రావుకు ఘన సత్కారం

ప్రముఖ సంఘ సేవకులు గౌతమ్‌రావును సత్కరిస్తున్న నృత్య గురువులు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: కూచిపూడి, భరతనాట్యం తదితర నృత్య కళలను ప్రోత్సహిస్తున్న గౌతమ్ రావు కృషిని పలువురు వక్తలు కొనియాడారు. కోవిద సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌతమ్ రావును నాంపల్లిలో శుక్రవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, తెలంగాణ జానపద వృత్తి కళాకారుల గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ అనూహ్యారెడ్డి, నాట్య గురువులు రమణి సిద్ధి, కె.రమాదేవి, కె.రామలక్ష్మి, లావణ్య, రజిత పాల్గొని గౌతమ్ రావును సత్కరించారు. విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా సమర్థవంతగా కృషి చేస్తూనే కళలను పరిక్షిస్తున్న కళాకారులకు తన వంతు తోడ్పాటును అందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. పలువురు కళాకారులు చేసిన నృత్యాంశాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. నృత్య కళా వికాసానికి కృషి చేస్తున్న నృత్య గురువులను ఈ సందర్భంగా అనూహ్యారెడ్డి సత్కరించారు.

శ్రీరాం వెంకటేశ్‌కు అవార్డు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ ప్రతిష్టాత్మక అవార్డును సాధించారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ సిస్టమ్స్ ఫర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఐఎస్ఎస్ఈ) ప్రతీ ఏటా అందించే ఐఎస్ఎస్ఈ ఫెలో మెంబర్‌షిప్ అవార్డ్‌ను ఆడిటివ్ మ్యానుఫాక్చరింగ్ (3డీ ప్రింటింగ్)లో శ్రీరాం అందించిన సేవలను గుర్తించిన ఐఎస్ఎస్ఈ అవార్డుకు ఎంపిక చేసింది. సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో సిస్టమ్స్ ఇంజినీరింగ్ విధానాన్ని ప్రోత్సహించేందుకు ఇంటర్ డిసిప్లీనరీ సహకారం కోసం పనిచేస్తున్న ప్రొఫెషనల్ సంస్థే ఐఎస్ఎస్ఈ. ఆయా రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారిని గుర్తించి ప్రతీ ఏటా అవార్డులను అందజేస్తోంది. కన్యాకుమారిలోని ఇస్రో ప్రపోల్షన్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఐఎస్ఎస్ఈ జాతీయ సదస్సులో ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఫీవర్‌లో ఆందోళన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

అంబర్‌పేట, ఫిబ్రవరి 2: నల్లకుంటలోని ఫీవర్ దవాఖానలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రెండోరోజు దవాఖాన ఆవరణలో సిబ్బంది ఆందోళకు దిగారు. ఉదయాన్నే సమ్మె చేపట్టారు. వెంటనే వేతనాలు చెల్లించకపోతే సమ్మెను ఇంకా ఉధృతం చేస్తామని తెలిపారు. తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, ఫీవర్ దవాఖాన యూనిట్ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు జనార్ధన్, నాగలక్ష్మి, చంద్రశేఖర్, శివ, కోశాధికారి శ్రీకాంత్, యూనియన్ నాయకులు బాలరాజు, కవిత, సరిత, అనూష, మహేశ్వరి, సురేందర్, అనిల్, ప్రవీణ్, కృష్ణవేణి, నవాజ్, రేణుక తదితరులు పాల్గొన్నారు. అయితే దవాఖాన సూపరింటెండెంట్ డా. కె. శంకర్ చొరవ తీసుకొని సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులను పిలిపించి వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని చెప్పారు. దీనికి స్పందించిన సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు మూడు నెలల పెండింగ్ వేతనాల్లో ఒక నెల వేతనాన్ని వెంటనే చెల్లిస్తామని తెలిపారు. మిగతా వేతనాలను త్వరలోనే విడుదల చేస్తామనడంతో సమ్మె విరమించారు.

పైప్‌లైన్లను తొలగించండి

అంబర్‌పేట ఛే నంబర్‌లోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న అలేఖ్య రాధా సదన్ అపార్ట్‌మెంట్ ముందు డ్రైనేజీ మ్యాన్‌హోల్ మధ్యలో నుంచి వాటర్ పైప్‌లైన్ కనెక్షన్ ఉంది. దీన్ని గుర్తించిన అపార్ట్‌మెంట్ వాసులు విషయాన్ని కార్పొరేటర్ బి. పద్మా వెంకటరెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆమె శుక్రవారం అక్కడికి వచ్చారు. ఫ్లై ఓవర్ సిబ్బందిని పిలిచి తక్షణమే మ్యాన్‌హోల్ మధ్యలో ఉన్న వాటర్ పైప్‌లైన్‌ను తొలగించాలని సూచించారు. దీనికి స్పందించిన సూపర్‌వైజర్ ప్రసాద్ తొలగిస్తామని తెలిపారు.
– అంబర్‌పేట, ఫిబ్రవరి 2

పదవీ విరమణ ఉద్యోగానికే..

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏఎవోగా పదవీ విరమణ పొందిన గిడి సత్యనారాయణను పలువురు ప్రముఖులు శుక్రవారం అభినందనలు తెలిపి ఘనంగా సన్మానం చేశారు. పదవీ విరమణ ఉద్యోగానికేనని, వయస్సుకు కాదని, సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన విద్యానికేతన్ కరస్పాండెంట్ కె.ఐజాక్ అరవింద్, ఐఎన్టీయూసీ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.ఎస్.ప్రకాశరావు, జర్నలిస్టు నర్సింహ, ఆర్.ప్రవీణ్ గౌడ్, వెంకటకృష్ణ(బబ్లూ), దామోదర్ రెడ్డి, రాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

4న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: ఇటీవల త్రిపుర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓయూ పూర్వ విద్యార్థి నల్లు ఇంద్రసేనారెడ్డికి సన్మానం చేయాలని ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం (ఏఏఓయూ), ఉస్మానియా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్ణయించాయి. ఈ నెల 4న సాయంత్రం నాలుగు గంటలకు పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఓయూ గెస్ట్‌హౌజ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఏఏఓయూ ఉపాధ్యక్షుడు శ్యాంమోహన్, ప్రొ.రమేశ్ రెడ్డి, మనోహర్‌రావులు పాల్గొన్నారు.

గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ షురూ..

భరతనాట్యంలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ కన్వీనర్ ముఖ్తార్ హైదర్

అబిడ్స్, ఫిబ్రవరి 2: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. ఫెస్టివల్ సలహాదారులు డాక్టర్ ప్రభాశంకర్, కన్వీనర్ ముఖ్తార్ హైదర్ నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భరత నాట్య ప్రదర్శన కార్యక్రమాలను విద్యార్థులు నిర్వహించి అందరి మన్ననలు అందుకున్నారు.

ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. హిందుస్తాని కవి సమ్మేళనం, ముషాయిరా కార్యక్రమాలతో పాటు నాల్గవ తేదీన బాలీవుడ్‌కు చెందిన జావేద్ అలి మ్యూజిక్ ఈవినింగ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

అఖిల భారతీయ బంజారా సేవా సంఘ్ జాతీయ కార్యదర్శిగా రఘు నాయక్



రఘునాయక్ రుడావత్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న అమర్‌సింగ్ తిలావత్

రవీంద్రభారతి, ఫిబ్రవరి 2: లంబాడి హక్కుల సాధన సమితి (డీఎల్‌హెచ్ఎస్ఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సినియర్ దాడి బంజారా నాయకుడు రఘునాయక్ రుడావత్‌ను అఖిల భారతీయ బంజారా సేవా సంఘ్ (ఏఐబీఎస్ఎస్) జాతీయ కార్యదర్శిగా నియమించారు. శుక్రవారం గిరిజన భవన్‌లో అఖిల భారతీయ బంజారా సేవా సంఘం సభ్యులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని జాతీయ అధ్యక్షుడు, మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ రఘునాయక్ రుడావత్‌కు అందజేశారు. రఘు నాయక్ రుడావత్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా బంజారా సమాజం ఇప్పటివరకు ఎంతో వెనుకబడిపోయిందని, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని తెలిపారు. బంజారాలకు అన్ని అవకాశాలు కల్పించాలని ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. బంజారుల ఐక్యతే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు.